# పల్లెల్లో కానరాని సురక్ష

- గ్రామాల్లో కనిపించని వైద్య శిబిరాలు
- గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఏర్పాటు
- ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పేదలు



శివలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

కె.గంగవరం: ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం చూపడంలేదు. గత ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరున గ్రామీణ ప్రాంతాల్లో నెలకు ఒకసారి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత కనీసం ఏ గ్రామంలో కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులపాలవుతున్నారు. ఏడాది నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయలేదు.

**ఆరోగ్య శ్రీ పథకం సక్రమంగా అమలు కాక..**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఈ ఆరోగ్య శ్రీ నిర్వాహణకు సుమారు 110 మంది పీహెచ్‌సీ మిత్రలను ఏర్పాటు చేశారు. వీరి ప్రతి మండలంలోని నెలకు ఒక సారి పేరొందిన వైద్యులు, పలు ఆసుపత్రుల సిబ్బందితో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. రోగులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేసి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్ చేయించేవారు. అంతేకాకుండా ఆపరేషన్ చేయించినప్పటి నుంచి రోగం నయం అయ్యే వరకు పీహెచ్‌సీ మిత్రలు వారి బాగోగుల చూసుకునేవారు. అప్పటి వరకు సజావుగా సాగిన ఈ పథకం ఒక్కసారిగా తారుమారైపోయింది. ఆరోగ్య శ్రీ పథకాన్ని కూడా బీమా సంస్థలకు అప్పగించడంతో ఆరోగ్యమిత్రలు కూడా కనుమరుగు అయ్యే పరిస్థితి వచ్చింది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలైతే నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. వైద్యశాఖ అధికారులు స్పందించి వెంటనే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న ప్రజలు**

గతంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పలు రకాల పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుని వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. రెక్కాడితేనే గాని డొక్కాడని తాము సొమ్ములు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించలేమని గ్రామీణ ప్రాంత పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పట్టణం వెళ్లాల్సి వస్తోంది



గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన విధంగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ఏడాది కాలంగా మండలంలో ఏ గ్రామంలోనూ ఒక్క కూడా శిబిరం నిర్వహించలేదు. ఏ చిన్న సమస్య వచ్చిన పట్టణం వెళ్లాల్సివస్తోంది.

– రాంబాబు యర్రపోతవరం

### సొమ్ములు ఖర్చు అయిపోతున్నాయి



పనిలోని వెళితేనే గాని పొట్టగడవని పేదొళ్లం. రోగం వస్తే దాచుకున్న సొమ్ములు మొత్తం ఖర్చు అవుతున్నాయి. ఏ చిన్న రోగం వచ్చిన ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నాం. గత ప్రభుత్వ హయంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కావాల్సిన మందులు ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు ఎక్కడికెళ్లాలో తెలియడంలేదు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

– కొప్పిశెట్టి లక్ష్మణ్, పేకేరు

## దుర్మార్గ పాలనను ఐక్యంగా ఎదుర్కొందాం



మండపేటలో జగ్గిరెడ్డి, తోట త్రిమూర్తులను సత్కరిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ తోట పిలుపు

కపిలేశ్వరపురం (మండపేట): దుర్మార్గ కూటమి పాలనను ఐక్యతతో ఎదుర్కొందామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర పీఏసీ సభ్యుడు తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా జగ్గిరెడ్డి, పీఏసీ సభ్యుడుగా తోట బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఇరువురూ మండపేటలో పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జగ్గిరెడ్డికి నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండలాల వారీగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను ఎమ్మెల్సీ తోట పరిచయం చేశారు. స్థానిక నాయకులను జగ్గిరెడ్డి ఆప్యాయంగా పలకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరిలతో మాట్లాడారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో జగ్గిరెడ్డి, తోట మాట్లాడుతూ సామాన్య ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడడం ద్వారా ప్రజలకు మరింత దగ్గరకావాలన్నారు. పార్టీ అధిష్టానం సూచనలు మేరకు పార్టీని క్షేత్ర స్థాయి నుంచి పటిష్టపర్చాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తాము అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న డిమాండ్లతో ప్రజల పక్షాన నిలవాలన్నారు. నియోజకవర్గ నాయకులు జగ్గిరెడ్డి, తోటలను సత్కరించారు. కార్యక్రమంలో మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ముమ్మిడివరపు బాపిరాజు, పొతంశెట్టి ప్రసాద్, అలీఖాన్ బాబా, నక్కా సింహాచలం, పలివెల సుధాకర్, మారిశెట్టి సత్యనారాయణ, పెంకే గంగాధరం, నీలం దుర్గ, బూరిగ ఆశీర్వాదం, మట్టపర్తి గోవిందరాజు, కుడిపూడి రాంబాబు, షేక్ గౌస్ మొహిద్దీన్, షేక్ అర్షద్, సయ్యద్ రబ్బానీ, పసలపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

## రెండు కిలోల గంజాయి స్వాధీనం

నలుగురిని అరెస్టు చేసిన రాయవరం పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్

రాయవరం: ఈజీ మనీ కోసం గంజాయిని తీసుకుని వచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను రాయవరం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ గురువారం మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్సై డి.సురేష్‌బాబులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ నెల 23న పసలపూడి శివారు బండిరేవుగట్టు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లుగా సమాచారం వచ్చింది. అక్కడకు రాయవరం ఎస్సై సురేష్‌బాబు సిబ్బందితో వెళ్లగా రామచంద్రపురం జల్లిపేటకు చెందిన కోగూరు రామ్‌తేజ, పసలపూడికి చెందిన చిటికెన కల్యాణ్‌వెంకటకుమార్, సత్తి దుర్గాప్రసాద్‌రెడ్డి, రామచంద్రపురం పట్టణానికి చెందిన మణిపూడి శ్రీసాయి వెంకటేశ్వరరావు పోలీసుల రాకను గమనించి మోటారు సైకిళ్లపై పారిపోయేందుకు ప్రయతించారు. వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నలుగురి చేతుల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను చూడగా సుమారు రెండు కిలోల గంజాయిని పోలీసులు గుర్తించారు. గంజాయిని తరలించడానికి ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్లను, గంజాయిని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నలుగురు నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి, గంజాయి తాగడానికి బానిసలయ్యారని తెలిపారు. గంజాయిని తాగడానికి తెచ్చుకొని మిగిలినది అమ్ముకొని ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆశతో దారకొండ ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకుని వచ్చారన్నారు. కేజీ రూ.2వేలకు కొనుగోలు చేసి, ఇక్కడ కేజీ రూ.10వేలకు అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురు వ్యక్తులను పరారీలో ఉన్నట్టు డీఎస్పీ రఘువీర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లుగా సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకుని రావాలని ఆయన సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## గురుకులంలో నూరు శాతం ఉత్తీర్ణత



కె.రమ్య, 573,ఎ.ప్రియాంక, 530,టి.వైష్ణవి, 529

రామచంద్రపురం రూరల్: ఈ నెల 23వ తేదీన విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రామచంద్రపురం మండలంలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ వి. పావణ్య గురువారం విలేకరులకు తెలిపారు. పాఠశాల నుంచి 28 మంది విద్యార్థినులు పది పరీక్షలకు హాజరు కాగా 28 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 27 మంది ఫస్ట్‌క్లాస్‌లోను, ఒక్కరు మాత్రం థర్డ్ క్లాస్‌లోను ఉత్తీర్ణులయ్యారన్నారు. కె.రమ్య 573 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం, ఎ.ప్రియాంక 530 మార్కులతో ద్వితీయ స్థానం, టి.వైష్ణవి 529 మార్కులతో తృతీయ స్థానం సాధించారన్నారు. పాఠశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ పావణ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఇ.సుగుణ, డిప్యూటీ వార్డెన్ కొప్పిశెట్టి రేణుకాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు



ఆర్యావటం విద్యుత్ సబ్‌స్టేషన్

కాజులూరు: వేళా పాళాలేని అనధికారిక విద్యుత్ కోతలతో మండల గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కరెంటు కోతల కారణంగా పగటి పూట ఎండ, ఉక్కపోత, రాత్రులు దోమల బాధతో సతమతమవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో అధికారికంగా విద్యుత్ కోతలు లేవని అధికారులు చెబుతున్నారు. అయితే అనధికారికంగా రాత్రి, పగలూ తేడా లేకుండా గంటల తరబడి కోత విధించడంపై ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం రాత్రి ఎనిమిది గంటల సమయంలో చిన్నపాటి గాలులతో వర్షం కురిసి గొల్లపాలెం తదితర గ్రామాలలో గృహవాసాలవారికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరుసటి రోజు తెల్లవారే వరకూ సిబ్బంది సరఫరా పునరుద్ధరించలేదు. గత మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్ర వరకూ సరఫరా నిలిచిపోయింది. బుధవారం సాయంత్ర అదే పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయాల్లో ఇష్టానుసారంగా విధిస్తున్న విద్యుత్ కోతకు ప్రజలు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. అధికారులు నిర్దిష్ట సమయాలు పాటించకుండా నిరంతరాయంగా కోతలు విధించడంతో పీహెచ్‌సీలల్లోనూ, పలు గ్రామాల్లోని మందుల షాపుల్లోనూ ఫ్రిజ్‌లు పని చేయక టీకాలు పాడైపోయే ప్రమాదముందంటున్నారు. కరెంటు పోయిన సమయంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందని మండలంలోని ఆర్యావటం సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే సిబ్బంది ఫోన్ లిఫ్టు చేయడంలేదని, ఒక వేళ ఫోన్ తీసినా సరఫరాలో టెక్నికల్ ప్రాబ్లం అని ఒకసారి, లోడ్ రిలీఫ్ అని ఒకసారి, బొమ్మూరు కటింగ్ అని ఒకసారి, రామచంద్రపురం బ్రేక్ డౌన్ అని మరొకసారి చెప్పి తప్పించుకుంటున్నారన్నారని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కోతలను ప్రకటించి నిర్దిష్ట సమయాలు పాటించాలని కోరుతున్నారు.

# ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



కపిలేశ్వరపురంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న అధికారులు

రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి, సమావేశపు హాలులో జాతిపిత చిత్రపటానికి ఎంపీపీ వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాల అభివృద్ధి పంచాయతీరాజ్ వ్యవస్థతోనే సాధ్యమని, పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, కార్యాలయ ఏవో గోపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పంచాయతీ పాలనపై అవగాహన ఉండాలి**

కపిలేశ్వరపురం: పంచాయతీ పాలన విధి విధానాలపై సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూర్తి అవగాహనతో వ్యవహరించాలని మండలంలోని 19 గ్రామాల్లో గురువారం నిర్వహించిన పంచాయతీ రాజ్ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రత్నకుమారి, ఈఓపీఆర్‌డీ ఆర్‌ఎంవీవీఎస్ ఈశ్వరరావు గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ కె.తాతారావు, కార్యాలయ ఏఓ రాజేంద్రప్రసాద్, హౌసింగ్ ఏఈ కె.శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరభద్రరాజు, కార్యదర్శి కె.శివచక్రవర్తి పాల్గొన్నారు.

**మండపేటలో...**

అర్తమూరులో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, చిర్ల రామన్న, చిర్ల వెంకట రెడ్డి, చిర్ల చంద్రా రెడ్డి, పట్నాల సత్యనారాయణ గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.



హసన్‌బాదలో మాజీ సర్పంచ్‌లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని 25 పంచాయతీల పరిధిలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. హసన్‌బాదలో గ్రామానికి సేవలందించిన మాజీ సర్పంచ్‌లు అల్లక సుందరరావు, కొండా అమ్మాజీ, గొల్లపల్లి పార్వతిలను గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, పంచాయతీ కార్యదర్శి కాశి రాకేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో దుశ్శాలువాలు, పూలమలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చేనేత సంఘాల నాయకుడు దొంతంశెట్టి సత్యప్రకాశ్, వీఆర్‌ఓ నరహరిశెట్టి సత్తిబాబు, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

## క్లుప్తంగా

### రేపు గొల్లాలమ్మ అమ్మవారి జాతర

కె.గంగవరం: అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యాక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం ఆలయం వద్ద తీర్థం జరుగుతుందని చెప్పారు. గత రెండు వారాల నుంచి ఆలయం వద్ద గ్రామస్తులు మొక్కుబడి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

### చలివేంద్రం ప్రారంభం



కేశవరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకన్నబాబు

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరంలో కుర్రా నాగ భూషణం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కుర్రా వీర్రాజు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు గురువారం ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీను, రాజు, నాయకులు మన్నే భూషణం, కుర్రా సత్యనారాయణ, తుపాకుల ప్రసన్నకుమార్, కుర్రా చంటి, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఎమ్మెల్సీ తోట అభినందనలు



మండపేటలో కృపారాణిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో ప్రగతి సాధించిన విద్యార్థులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం అభినందించారు. ఉన్నత చదువుల్లో సైతం రాణించి బంగారు భవితకు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బొక్కా రాంబాబు కుమార్తె కృపారాణి మండపేటలో ఎమ్మెల్సీ తోటను కలిసి ఆశీర్వాదం తీసుకుంది. విద్యార్థిని కృపారాణిని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ శీలం భాస్కరరావు, నాయకులు కట్టా మురళి అభినందించారు.

### కాశ్మీర్ ఘటనలో మృతులకు నివాళి



అంగరలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న అంగర గ్రామస్తులు

కపిలేశ్వరపురం: కాశ్మీర్ పర్యాటకులను ఉగ్రవాదులు మట్టుబెట్టడాన్ని నిరసిస్తూ అంగరలో బుధవారం రాత్రి అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ సెంటర్‌లో జనసేన పార్టీ నాయకులు పిల్లా బసవరాజు, తోరాటి శ్రీను, రాంబాబు నారాయణమూర్తి, ఫణి, సుభాష్, రాము, దుర్గబాబు, శరత్ మాట్లాడుతూ ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పించారు.

### మంచినీటి వృథాను అరికట్టండి



ద్రాక్షారామ బెస్తాపేటలో మంచినీటి కుళాయికి ట్యాపు లేక వృథా అవుతున్న నీరు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ గ్రామం బెస్తాపేటలో మంచినీటి వృథాను అరికట్టాలని మైనార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు గురువారం పంచాయతీకి విజ్ఞప్తి చేశారు. బెస్తాపేటలో కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న మంచినీటి కుళాయికి ట్యాప్ ఊడిపోవడంతో నీరు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ట్యాపు బిగించి వృథాను అరికట్టాలని కోరారు.

### వేతనం రూ.26వేలకు పెంచాలి

అయినవిల్లి: వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ అయినవిల్లి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓ జి.భీమారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. తాము 19 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నామన్నారు. తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎంపీడీఓను కలిసిన వారిలో మండల ఫీల్డు అసిస్టెంట్లు యూనియన్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి ఈ-శ్రమ్ పథకంపై అవగాహన

రాయవరం: ఈ-శ్రమ్ పథకంపై గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ విడుదల చేస్తున్నట్టు రాయవరం మండల సహాయ కార్మిక శాఖ అధికారి టీఎస్ కార్తీక్ తెలిపారు. శుక్రవారం నుంచి మే 22వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో ఈ-శ్రమ్ పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో రెండు రోజుల వంతున అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో రాయవరం, ఈ నెల 28న లొల్ల, 29, 30 తేదీల్లో సోమేశ్వరం, మే 1, 2 తేదీల్లో నదురుబాద, 3, 5 తేదీల్లో వెదురుపాక, 6, 7 తేదీల్లో వి.సావరం, 8, 9 తేదీల్లో పసలపూడి, 12, 13 తేదీల్లో వెంటూరు, 14, 15 తేదీల్లో మాచవరం, 16, 17 తేదీల్లో కూర్మాపురం, 19, 20 తేదీల్లో చెల్లూరు, 21, 22 తేదీల్లో కురకాళ్లపల్లి గ్రామాల్లో ఈ-శ్రమ్ పథకంపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అసంఘటిత రంగ కార్మికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ-శ్రమ్ పథకం కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: విద్యుత్ లైన్లపై చెట్టుకొమ్మల తొలగింపు నిమిత్తం అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. అంగర, టేకి, మాచరమట్లలు, శ్రీరామపురం గ్రామాల్లో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### బస్‌షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో ఆర్యావటం కోళ్లతూము సెంటరులో బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌కు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు వచ్చి ఆటో, బస్సు లెక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపుల అరుగుల పైన దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం నిరిక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ సెంటరులో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

రామచంద్రపురం రూరల్: ఏరుపల్లికి చెందిన రైతు చవాకుల సతీష్(35) వ్యవసాయం చేస్తూ అప్పుల పాలయ్యాడు ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీన గన్నేరు పప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ గురువారం తెలిపారు.

### పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ

ఆలమూరు: మండలంలోనిన్న ఆలమూరు, చొప్పెల్ల సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం గురువారం ఏర్పాటు చేసిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో కక్షిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ట్రాన్స్‌కో రామచంద్రపురం డీఈ కె.రత్నాలరావు, టెక్నికల్ డీఈ విజయానంద్, ట్రాన్స్‌కో ఏడీఈ సీహెచ్ శ్రీధర్ నేతృత్వంలో కొత్తూరులోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, విద్యుత్ సాంకేతిక మండలి సభ్యులు సురేఖరాణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబా, ఫైనాన్స్ సభ్యులు ఎస్.సుబ్బారావు, స్వాతంత్ర్య సభ్యులు ఎస్.మురళీకృష్ణ పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ఆలయానికి కుర్చీల సమర్పణ

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత శ్రీపోలమ్మకు అదే గ్రామానికి చెందిన యెరుబండి సూర్య పది ప్లాస్టిక్ కుర్చీలను సమర్పించారు. వీటిని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సాధనాల సుబ్బారావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాత సూర్యను చైర్మన్ సుబ్బారావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో యెరుబండి పెదఅయ్యన్న, యెరుబండి కన్నబాబు, స్థానికులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయింపు

రావులపాలెం: మండలంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో వారి నివాసానికి ఒక కిలోమీటర్ పరిధిలోని వివిధ పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఒక కిలోమీటర్ పరిధిలో లేకుంటే మూడు కిలోమీటర్ల పరిధిలో ఎంపిక చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు దారులు గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000, పట్టణ ప్రాంతంలో రూ.1,44,000 వార్షిక ఆదాయానికి మించి ఉండకూడదన్నారు. అర్హులైన వారికి దరఖాస్తు విషయంలో గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ సహాయం తీసుకోవచ్చునన్నారు. అనాథలు, హెచ్ఐవీ ఎఫెక్టెడ్, దివ్యాంగుల వారికి ఐదు శాతం. ఎస్సీలకు 10 శాతం. ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీలకు, ఇతరులకు 6 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన హెల్ప్ డెస్క్‌ను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు ఎం.రాజేంద్రప్రసాద్, సీఆర్ఎంటీ 9059583609 ఈ నంబరులో సంప్రదించాలన్నారు.